క్లుప్తంగా

రహదారి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ లోవరాజు, తలారి ఆదిమూర్తి

రావికమతం: వడ్డాది,గుమ్ముడు,వీర్నాల కుటుంబాల రైతుల కల్లాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి బూరుగుమాను కట్టు వద్ద బుధవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ భర్త రమణమ్మ కోటా నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. తలారి ఆదిమూర్తి,సర్పంచ్ కోన లోవరాజు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు శీలం శంకర్రావు, మాజీ ఉప సర్పంచ్ గున్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి



వడ్డాదిలో నిర్మానుష్యంగా మారిన బీఎన్ రోడ్డు

బుచ్చెయ్యపేట: సూర్యుడు బుధవారం నిప్పులు చెరిగాడు. 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంది. వడగాడ్పులు, ఉక్కపోతతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

152 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. కింతాడలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, 152 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అనారోగ్యానికి గురైనా వెంటనే చికిత్స పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ బి.రాము, డి.ఎస్.ఎన్.రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

75 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైన వృద్ధులు, మహిళలు

కె.కోటపాడు : చౌడువాడలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ప్రారంభించారు. చౌడువాడ, మల్లంపాలెం, పాచిలవానిపాలెంలకు చెందిన 75 మందికి ఆప్తాలమిక్ చందన కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో 31 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్టు క్యాంప్ కోఆర్డినేటర్ పైడిరాజు తెలిపారు.

జన్‌భాగీ దరీపై అవగాహన ర్యాలీ



కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రావికమతం: పూర్వప్రాథమిక విద్య కార్యక్రమం ఆవశ్యకతపై అవగాహన కలిగించేందుకు జన్‌భాగీదరీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కొత్తకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ తెలిపారు. కొత్తకోటలో10 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు,ఆయాలు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ఆటపాటలతో ఇంగ్లిషు నేర్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జీఎంఎస్‌కేలు రమ్య,కిరణ్,రత్నకుమారి పాల్గొన్నారు.

ఖరీఫ్ జోరు.. రైతు హుషారు

● 15 వేల ఎకరాల్లో పంటల సాగుకు ఏర్పాట్లు



వడ్డాదిలో సిద్ధం చేసిన మడి



శింగవరంలో ఖరీఫ్ పంటల సాగుకు దుక్కు చేసిన పొలం

బుచ్చెయ్యపేట: ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. రైతులు ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు చేయడంతో పాటు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి,చెరకు,మినుము,పెసర, గంటి,చోడి,కందులు, గంటెలు, వేరుశెనగ,నువ్వులు తదితర పంటలను సాగు చేస్తారు. పంటల సాగుకు ఇప్పటికే మూడునాలుగు సార్లు పొలాన్ని దున్ని భూమిలో సేంద్రియ ఎరువులు కలిపి దుక్కులు చేశారు. 6,800 ఎకరాల్లో వరి పంట సాగుకు ఆకుమడులు సిద్ధం చేశారు. 400 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వంగ,టమాటా,బీర,బెండతో పాటు పలు రకాల ఆకుకూరలు సాగు చేస్తారు. సీజన్‌కు ఆరంభానికి ముందే వైఎస్సార్ రైతు భరోసా (పెట్టుబడి సాయం)ను ప్రభుత్వం అందజేసింది. ఆర్బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, అవసరమైనన్ని ఎరువులు, పురుగుల మందుల నిల్వల్ని అందుబాటులో ఉంచింది.1,210 క్వింటాళ్ల స్వర్ణ, జయ,శ్రీకాకుళం సన్నాలు,సాంబ మసూరి,సోనా మసూరి,అమరావతి తదితర రకాల వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.పలు ప్రాంతాల్లో విత్తనాల పంపిణీ ప్రారంభించారు.

అందుబాటులో వ్యవసాయ సిబ్బంది



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాం. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్నాం. ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించడానికి వీలుగా రైతులకు సూచనలు,సలహాలు అందించడానికి వ్యవసాయశాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

– ఎ.భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట.

ఉప సర్పంచ్‌గా అప్పలనర్సమ్మ ఏకగ్రీవం



అప్పలనర్సమ్మను అభినందిస్తున్న సర్పంచ్ బూరె బాబురావు, వార్డు మెంబర్లు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ ఉప సర్పంచ్‌గా బొబ్బిలి అప్పలనర్సమ్మను వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్లు పూర్తి కావడంతో ముందస్తు అంగీకారం(ఒప్పందం) మేరకు ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా పనిచేసిన కోన శ్రీను ఆ పదవికి రాజీనామా చేశారు. దీంతో స్థానిక సర్పంచ్ బూరె బాబురావు అధ్యక్షతన బుధవారం ఎన్నిక నిర్వహించారు. పంచాయతీ రెండవ వార్డు సభ్యురాలైన బొబ్బిలి అప్పలనర్సమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆమెను సర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జి. సంతోష్ నళిని, స్థానిక పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15 ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న చంద్రమౌళీశ్వర శర్మ

కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో 15 గ్రామాల్లో 15 ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు సమకూర్చినట్టు ధర్మ ప్రచార పరిషత్ విశాఖపట్నం క్లస్టర్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విజ్ఞప్తి మేరకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఈ నిధులను సమకూర్చినట్టు చెప్పారు. మండలంలోని గొండుపాలెంలో గల కొత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న రామాంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.10లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గ్రామస్తులు కృతజ్ఞతలను తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, బండారు అర్జున, బండారు మంగపతి, వంటాకు నాయుడు, మద్దాల రాము, ఈర్లె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

ప్రయాణికులకు ఇక్కట్లు





వారాడ వెళ్లే మార్గంలో ప్రమాదకరమైన మలుపులు

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం నుంచి వారాడ వెళ్లే రోడ్డులో పలు చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. సింగిల్ రోడ్డుగా ఉన్న మార్గంలో వర్షాల కాలంలో మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డుమరింత ఇరుకుగామారుతోంది. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టడడంతో పాటు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

చోడవరం రూరల్: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేసినవారవుతారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం మరియు ప్లాస్మాలను తరచూ దానం చేయాలని కోరారు. అకడమిక్ కో ఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం పట్ల పూర్తి అవగాహన కలిగి ఆదర్శంగా నిలవాలన్నారు. స్థానిక సాయి ల్యాబ్స్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల విద్యార్థులకు రక్తపరీక్షలు జరిపి బ్లడ్ గ్రూపింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి,బి.లక్ష్మి,పి.పిచ్చమ్మ,ఉపన్యాసకులు రావి రాణి, ఎస్.మల్లిబాబు, జి.వెంకటేష్,లక్ష్మిమంగమ్మ,టి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించండి



వడ్డాదిలో అంగన్‌వాడీ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. వడ్డాదిలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బుధవారం నిర్వహించిన అక్షరాభ్యసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సదుపాయాలు కల్పించి ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించాలని సూచించారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి,సర్పంచ్ గోపిశెట్టి శ్రీను,అంగన్‌వాడీ టీచర్లు అమ్మాజీ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై ఆర్డీవో విచారణ

స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



పెదపల్లిలో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో వివాదాస్పద భూమిపై బుధవారం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తహసీల్దారు రాణీ అమ్మాజీతో కలసి విచారణ చేపట్టారు. పెదపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన వివాదస్పద భూమిపై స్పందనలో కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ రవిపటాన్‌శెట్టి ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ బుధవారం పెదపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదపల్లిలో భూమి అక్రమణకు గురైనట్టు కొందరు వ్యక్తులు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి వివాదస్పద భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

నేడు మరిడిమాంబ పండగ

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో గురువారం మరిడిమాంబ పండగ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరపనున్నట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

మాడుగుల రూరల్: మండలంలో గొర్రెలు, మేకలకు వేసేందుకు గురువారం నుంచి ఈ నెల 30 వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్టు స్థానిక ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పది,ఇంటర్ విద్యార్థులకు సన్మానం

మాడుగుల రూరల్: నియోజకవర్గ స్థాయిలో మంచి మార్కులు సాధించిన పది,ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గురువారం స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో సన్మానించనున్నట్టు ఎంఈవో బి.దేముడమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనున్నట్టు చెప్పారు.


నేడు కృష్ణంపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

మాడుగుల రూరల్: మండలంలోని కృష్ణంపాలెంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ రాపేట రామకొండలరావు బుధవారం తెలిపారు. అనిల్ నీరుకొండ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల వద్ద ఉదయం 9 గంటల నుంచి శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం

మాకవరపాలెం: ఐదేళ్లు పూర్తయిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తూటిపాల పాఠశాల హెచ్ఎం కోసూరు రాము తెలిపారు. గ్రామంలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేశారు. నాణ్యమైన విద్య అందించేందుకు తాము కృషి చేస్తామని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని గణపర్తిలో బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిపారు.

నేడు చింతలూరులో గడప గడపకు మన ప్రభుత్వం

మాడుగుల రూరల్: చింతలూరులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పాకలపాడులో..

గొలుగొండ: మండలంలోని పాకలపాడులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు.ముఖ్య అతిథిగా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొంటారని, పార్టీ నాయకులు,కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

కమిషనర్‌గా వీరయ్య బాధ్యతల స్వీకారం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా డి.ఇ వీరయ్య బుధవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్ రమాకుమారి, కౌన్సిల్ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

నీట్‌లో దేవరాపల్లి మండల విద్యార్థుల ప్రతిభ



ఉదయ్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



నీట్‌లో ర్యాంక్ సాధించిన కాకి లిఖిత

దేవరాపల్లి : నీట్‌లో మండలంలోని ఇద్దరు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్ రెండో కుమారుడు ఉదయ్‌కుమార్ 610 మార్కులు సాధించి, ఆలిండియాలో 23180 ర్యాంకును, ఓబీసీ-ఎన్‌సీఎల్ (సెంట్రల్ లిస్టు) కేటగిరిలో 9917వ ర్యాంక్ సాధించాడు. ఉదయ్‌కుమార్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి జగన్, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు. నీట్ ఫలితాల్లో మండలంలోని ఏ. కొత్తపల్లికి చెందిన కాకి లిఖితకు 18,944వ ర్యాంకు, ఓబీసీ-ఎన్ఎల్‌సీ కోటాలో 7943వ ర్యాంకు లభించింది. ఈమె 619 మార్కులు సాధించింది. బాలిక తల్లి గృహిణి కాగా, తండ్రి కాకి నర్సింహమూర్తి కె.కోటపాడు మండలం ఏ.కోడూరులో వస్త్ర దుకాణం నడుపుతున్నారు. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ ఢిల్లీలోని ఆలిండియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌తో పాటు పీజీ పూర్తి చేసి స్త్రీ వైద్య నిపుణురాలిగా సేవలందించాలన్నది తన లక్ష్యమని తెలిపింది.

విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన

● 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వవిప్ ధర్మశ్రీ

రోలుగుంట: రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని కె.నాయుడుపాలెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుములూరి బాబులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఇళ్లపట్టాలు, మంచినీరు, డ్రైనేజీ తదితర సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా ప్రజల వద్దకు ఎమ్మెల్యేలు వచ్చి సమస్యలను అడిగే విధానం గతంలో ఏనాడైనా ఉందా అని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల సమయంలో కనిపించే ప్రజా ప్రతినిధులు ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. పరిపాలనా సంస్కరణల్లో ఇది ముఖ్యమంత్రి జగన్ మార్క్ అని చెప్పారు. ఈకార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూనూరు బుల్లిబాబు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పోతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణకు సమాయత్తం కావాలి



రోడ్డు విస్తరణపై అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణకు అధికారులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సూచించారు. రోడ్డు విస్తరణపై ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీవో హెచ్.వి.జయరాం సమక్షంలో మున్సిపల్, అర్అండ్‌బీ, విద్యుత్‌శాఖ, పబ్లిక్ హెల్త్, పోలీసు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. విస్తరణ విషయంలో అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. చేపట్టాల్సిన పనులపై పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెల 16న జరిగే సమావేశానికి అధికారులు పక్కా సమాచారంతో రావాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, టౌన్ సీఐ గణేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్అండ్‌బీ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం:ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుండడంతో కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముందుగా అబిద్‌సెంటర్‌లోని వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.ఆర్.శర్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. గతంలో పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ



ఏఎల్‌పురం హైస్కూల్లో కిట్లు అందజేస్తున్న దృశ్యం



గవరవరంలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గొలుగొండ: విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఏఎల్‌పురం సర్పంచ్, జిల్లా ఎస్సీసెల్ విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత తెలిపారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాడు-నేడు పథకంతో స్కూళ్ల రూపురేఖలు మార్చడంతో పాటు పాఠశాలల ప్రారంభం రోజునే విద్యాకానుక కిట్లు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎం.కె.వల్లాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉపసర్పంచ్ కరణం రాము జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మి, హెచ్ఎం వాణిశ్రీ, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గవరవరం ఉన్నత పాఠశాలలో 3 నుంచి పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సర్పంచ్ చప్పగడ్డి మాణిక్యం, ఉప సర్పంచ్ పతివాడ అప్పారావు బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చప్పగడ్డి అప్పలనాయుడు, వైస్ చైర్మన్ గుమ్మాల పావని, హెచ్ఎం జి.జె.సుందర్‌సింగ్ పాల్గొన్నారు

మాడుగుల: మండలంలో జేడీ పేట ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. స్థానిక వైస్ ఎంపీపీ టి.వి.రాజారామ్, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి వీటిని అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

చోడవరం రూరల్: అనకాపల్లిలో ఈ నెల 18న జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు బుధవారం విజ్ఞప్తి చేశారు. రోటరీ కళ్యాణమండపంలో జరగనున్న మహాసభల గురించి విస్తృత ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు.